# కన్నతల్లి కథ



'పరీక్షలయిపోయినాయోయ్!'

అని కేకేసుకుంటూ, అట్ట గాల్లోకి విసరేసి పట్టుకుంటూ వచ్చాడు సుగుణమ్మ ఆఖరు కొడుకు. వచ్చినవాడు వాకిలి దాటుతూనే చేతిలో అట్టా, జేబులో పెన్నూ విసిరికొట్టాడు గూట్లోకి. 'పెన్ను పాడవుతుంది' అంది, పిల్లల బట్టలకు చిరుగులు కుట్టుకుంటూ కూర్చున్న సుగుణమ్మ. ఆమె హెచ్చరికను వాడు గుర్తించకుండానే వచ్చి, 'ఇంక రెన్నాళ్ళు మాకు సెలవు' అన్నాడు సంతోషంగా అమ్మతో. ఆమె మాట్లాడలేదు. అబ్బిగాడింకో మాటెత్తాడు.

'అమ్మా! ఈ రోజు కాపీ కొట్టకుండా రాసేసినా, అమ్మమీద వ్యాసం ఇంకా బాగా రాసినా' అని ఎదురుగా కూర్చున్నాడు. సుగుణమ్మ కొడుకేసి చూస్తూ 'ఏమని రాసినావు?' అంది చిరునవ్వుతో.

'అమ్మ ప్రేమ అనే అమృతమిచ్చి బిడ్డలను పెంచును...' అని చెప్పడంతో వాడు సిగ్గుపడుతున్నట్లుగా ఆపేశాడు. 'నీ కెట్లా తెలుసు?'

'ఇంతకు ముందున్న మేరీ టీచర్ చెప్పింది... అమ్మమీద పాటకూడా ఎంత బాగా పాడేదని! అమ్మా! మేరీ టీచర్ని మా స్కూల్నుంచి మార్చింది ఎందుకనో?' సుగుణమ్మ వింటూంది.

టీచర్స్‌ని ట్రాన్స్‌ఫర్ చేయడానికి గల కారణాలు కొంతవరకూ సుగుణమ్మకు తెలుసును. ఆ కారణాలు తన కొడుకు ప్రేమిస్తున్న మేరీ టీచర్ విషయంలో చెప్పాలనిపించలేదు. అమ్మ మాట్లాడక పోవడంతో అదే ఆలోచిస్తూందన్నట్టు చూస్తున్నాడు వాడు కుతూహలంగా.

'అమ్మ మీద పాట అందరికీ చెప్పాలి కదా! లేపోతే అమ్మను గురించి పిల్లల కేం తెలుసు? అందుకని మార్చేసి ఉంటారు ఆ టీచర్ని.' ఒక్క క్షణం ఆలోచించి వాడు ఒప్పేసుకున్నట్టు ఇంకా దగ్గరగా జరిగి అమ్మ మీద చెయ్యి వేశాడు. సందేహం తీరడంతో వాడు మామూలుగా అయ్యాడు.

'అమ్మా! ఆకలిగా ఉందే. అన్నం కాలేదూ?' అన్నాడు.

'పదైనా కాలేదు—అప్పుడే అన్నమా?'

'ఆకలేస్తోంది. . .' కడుపు రుద్దుకుంటూ, కళ్ళలో నీళ్ళు మెదులుతుండగా అన్నాడు.

'ఆడుకుంటూండు, అవుతూనే పెడ్తాను.' బట్టలు మడత పెట్టి పట్టుకుని లేచింది.

'ఆకలేస్తోంది. . .' మళ్ళీ అదే మాట! ఈ సారి ఏడుపు తన్నుకొస్తున్నట్టు, ఇప్పుడు అన్నం తినకపోతే ఆడుకో లేను, అసలు కదల్లేను! అన్నట్టు అక్కడే పడుకున్నాడు.

'ఛీ! ఛీ! బట్టలు మాస్తాయి, లే. దరిద్రపు వెధవా!' అని కసిరింది. అంత కోపం తెచ్చుకుని, ఆ మాట అనాలనుకో లేదు ఆమె. అదే వచ్చేసింది. అందుకే ఇంకా చిరాకు కలిగింది.

'తెల్లారింది మొదలు ఆకలి. . . ఆకలి. . . ఇదేం జబ్బో!'

'ఆకలెయ్యడం జబ్బా?' అన్నాడు రెండో వాడు. అప్పుడే లోపలి కొచ్చి.

'ఆకలి వెయ్యకపోవడమే జబ్బు!' అన్నాడు పెద్దవాడు నెమ్మదిగా, కచ్చితంగా. ఎప్పుడొచ్చాడో వాడు బయట వసారాలో మంచంలో పడుకున్నాడు.

'మీకూ అప్పుడే ఆకలేస్తోందా?, "అందుకు సందేహమా?"' అన్నట్టు వాళ్ళు పలకలేదు.

'కాఫీలు తాగి గంట కాలేదు, అప్పుడే ఆకలో అంటే అయినట్లే ఇక!'

'ఒట్టి కాఫేగదా?' రెండో వాడు.

'అదీ బెల్లంది.' పెద్దవాడు.

'ఏదయితే నేం? బెల్లం కాఫీ తాగేది మనమే కాదు.'

'ఆకలేసేదీ మాకే కాదు.' మళ్ళీ పెద్దవాడు.

'అయినా, ఎవరూ మీ లాగా గొడవ చెయ్యరు.'

'టిఫిన్లు తింటే ఎందుకు చేస్తారు?'

సుగుణమ్మ మాట్లాడలేదు.

ఏ వస్తువు కొని టిఫిన్‌గా పెట్టడం సాధ్యమౌతుంది? ఈ పిల్లలకు అదంతా చెప్పాలా? చెబితే మాత్రం? టిఫిన్ తినేందుకు వేసే ఆకలికి, అది పెట్టలేక పోవడంతో తన నిస్సహాయత వివరిస్తే పరిష్కార మవుతుందా?

వడిలిపోయిన నాలుగైదు వంకాయలు తరుగుతూ కూర్చుంది. రెండు మూడు రూపాయలిస్తే కానీ పూట కాయగూరలు రావు. అదీ పిల్లలు పోతే, కూరలవాడు చచ్చినీ, పుచ్చినీ పడేస్తాడు. అందులో తూకంలో మోసం! ఇంటి దగ్గరి కొచ్చే కూరలవాళ్ళు రెండింతల ధర చెబుతారు. ఉదయంపూట తను వెళ్ళడానికి వీలుండదు. ఎటు చూసినా ఏదో బాధ!

'కొబ్బరన్నా ఉంటే ఇవ్వవూ?' అన్నాడు చిన్నవాడు.

'లేదు. . .' అంది సుగుణమ్మ. కొబ్బరి ధరెంతో మనసులో మెదిలింది.

'పచ్చిదా. . .'

'అదీ లేదు.' పచ్చిదధర కూడా. తక్కువ సరిగా!

'బెల్లంకూడా'.

పలకలేదు. వాడు ఏడుపు సాగించాడు.

'ఎప్పుడూ ఏమీ ఉండవు. మోహన్ వాళ్ళమ్మ ఎప్పుడూ ఇడ్లీ, మైసూరు పాకు చేసి పెడుతుంది.'

'ఇడ్లీ, మైసూరుపాకులా! ఆకలేసి నప్పుడు అన్నమన్నా పెడితే చాల్దా?' అన్నాడు పెద్దవాడు.

'ప్రభాకర్ వాళ్ళింట్లో ప్రతి రోజూ టిఫిన్ చేసుకుంటారు. ఒక్కో రోజు సాయంత్రంకూడా చేసుకుంటారంట!' అన్నాడు రెండో వాడు.

'రెండు సార్లు టిఫిన్లు చేసు కుంటారూ?' ఆశ్చర్యంగా అడిగాడు చిన్న వాడు. పుష్పరేకు కదిలి మంచుబిందువులు రాల్చినట్టు, వాడి కళ్ళలో పాకిన ఆశ్చర్యం కన్నీటిని చిలకరించింది. వంకాయలు తరుగుతూనే వాడి కేసి చూస్తోంది సుగుణమ్మ. వా డింకా ఆశ్చర్యం నించి కోలుకోలేదు.

'అబ్బ! రోజూ రెండు సార్లు టిఫిన్లు! ఇంకేం? ఏమేం చేసుకుంటారో?' ఎందుకో అమ్మ వైపు చూశాడు. సుగుణమ్మ చురుక్కున చూపు మార్చి వంకాయను మెత్తగా తరుగుతున్న కత్తిపీట కేసి చూస్తోంది.

తులసీకృష్ణ



చిటచిటలాడే ఎండ
ఫోటో— ఎస్. మల్లారెడ్డి ( మద్రాసు )

'అయితే, ప్రభాకర్ వాళ్ళింట్లో తినవే తినడు' అన్నాడు రెండో వాడే.

'తినడూ? ఏం?' చిన్నవాడి ఆశ్చర్యం శిఖరం తాకింది. తాకిడికి తట్టుకోలేక లేచి నిలుచున్నాడు, ఎందుకో కుదరక మళ్ళా కూర్చున్నాడు. ముక్కల్ని చెంబుల నీళ్ళలో కడుగుతూ వింటూంది సుగుణమ్మ.

'ఎందుకని తినడు ప్రభాకర్?' ఎంత ఆలోచించినా అర్థం కాలేదు వాడికి.

'హోటల్లో తింటాడు.'

'ఏం?'

'ఇంట్లో బాగుండదంట. తనతో పాటు ఇద్దరు ముగ్గురు కైనా తనే డబ్బు పెట్టుకుంటాడు. జేబులో ఎప్పుడూ డబ్బుంటుంది' అని స్వరం తగ్గించి అమ్మ వైపు చూసి, 'ఒక రోజు నేనూ స్పెషల్ దోసె తిన్నాను' అన్నాడు. చిన్నవాడు ఆత్రంగా రెండో వాడి దగ్గరగా జరిగాడు.

'స్పెషల్ దోసె ఎట్లా ఉంటుంది?' ఆసక్తిగానూ, అమ్మకు వినపడకుండా రహస్యంగానూ అడిగాడు.

'ఎట్లా అంటే?'

'ఎట్లా ఉంటుందని?'

'బాగుంటుంది.'

'బాగా సరే. ఎట్లా ఉంటుందని!'

'నీ మొహంలా ఉంటుంది.' చెప్పలేక కసురుకున్నాడు.

వినలేక లేచింది సుగుణమ్మ.

ఆ ప్రభాకర్‌తో కలిసి హోటల్లో స్పెషల్ తిన్నందుకు రెండోవాణ్ణి మందలించాలా, వద్దా? అమ్మకు తెలీకుండా, రహస్యంగా చేస్తున్న సంభాషణ అమ్మ రహస్యంగా వింటుం వాళ్ళ కర్మ పూర్తౌతుంది. అదే కాదు, అసహ్యం పెట్టడు, అదుపు. తినవిషయం—అన్న ప్రాంత పిల్లలకు తెలికపోవచ్చు మ. తనకు తెలుసును. కాదు. . . కాదు. అట్లా ఆలోచించకూడదు. అది కేవలం తన బలహీనత అవుతుంది. తన పిల్లలకంటే ఇంకా హీనస్థితిలో, వీధుల్లో కుక్కల కంటే దీనంగా బ్రతుకుతున్న పిల్లలున్నారు దేశంలో! వాళ్ళలో ఎంతో మందికి అమ్మ ఉంటుంది. ఆ 'అమ్మ' కంటే తనెంత నయం? తన పిల్లలేదో తింటున్నారు వేళకు. డబ్బున్న వాళ్ళ వైభోగాలు మాత్రమే చూడగలిగిన వాళ్ళనుగా పిల్లల్ని తయారు చేసుకోవడం తల్లిగా తన కర్తవ్యం కాదు. నిజమైన ఆకలికీ, అలవాటుకీ ఉన్న తేడా ఎంతో మంది పెద్దలకే తెలీదు. ఇంక పిల్లల కేం తెలుసు?

సుగుణమ్మ వంట చేస్తూనే ఆలోచిస్తోంది. బియ్యం డబ్బాలో నించీ అందుకుంటున్నప్పుడు అదిరి పడింది. పూర్తిగా మూత తీసి, కిటికీ రెక్క తెరిచి, బియ్యంలో చేయి ముంచి చూసి, నెమ్మదిగా. . . గుండె ఆగిపోకుండా నన్నట్లు ఊపిరి పీల్చుకుంది. పగిలిన రబ్బరు తిత్తిలించి గాలి వస్తున్నట్లుగా విడిచింది. బియ్యం ఇంత తక్కువగా ఉన్నాయని ఇంతకు ముందు పూటకూడా అనుకోలేదు. తన భయం వల్ల అట్లా కనిపిస్తున్నాయేమోనని మళ్ళీ చూసింది. పిల్లల సంభాషణ ఎట్లా, ఎక్కడ రూపం మారిందో మళ్ళీ మొదటికొచ్చింది.

'ఇంకా కాలేదా అమ్మా?' అని కేకేశాడు చిన్నవాడు.

'ప్స్. కడుపులో బాధగా ఉంది' అన్నాడు పెద్దవాడు మంచంలో మూర్ఛపోతున్నట్లు పడుకుని.

'చచ్చిపోతున్నావా తేజూ?' అన్నాడు రెండోవాడు.

'నేనూ మనిషినేరా. ఆకలంటూనే అన్నం పెట్టడం నా వల్ల కాదు. మీ ఆకలి మరీ విచిత్రంగా ఉంది. ఎన్ని రోజులనించి అన్నం లేనట్లు! కాసేపటికి చచ్చిపోతున్నామన్నట్లు! ఒక వెధవల్లారా! వేళకు తింటేనే బియ్యం కొనడానికి ఇంత చావుగా ఉంటే, తెల్లవారుతూనే అన్నం మింగాలంటే రోజు కెన్ని సార్లు వండి మీ కడుపులు నింపేది? మళ్ళా వచ్చేవాళ్ళకూడా మిగలాలా? ముగ్గురూ వీధుల్లో పడి, మా అమ్మ ఇంకా అన్నం పెట్టలేదు—మేం ఆకలితో చస్తున్నామని అడుక్కోండి! కాకపోతే మీ అమ్మ చచ్చిందనండి! పొండి. . . పాడు పిల్లల్లారా!' ఆ అరుపు . . . ఆక్రోశం పేలికి, పగిలి, అగ్నిగుండం గుప్పుమని నిప్పురవ్వలు విసిరినట్లుగా.

సుగుణమ్మకి నిద్ర పట్టడం లేదు. బియ్యం డబ్బాలో అడుగున తాకినప్పటి స్పర్శ ఇంకా ఉలికిపాటు కలిగిస్తోంది. పిల్లలకు సెలవు లొచ్చినాయి. బియ్యం త్వరగా అయిపోయినాయి. పిల్లల సెలవు లకూ, బియ్యానికీ సంబంధ మేమిటో తనలాంటి అమ్మకే తెలుసు. స్కూలు ఉంటే రోజుకు రెండు సార్లు మాత్రమే అన్నం తింటారు. సెలవులు గనక పిల్లలకేం తోచక ధ్యాస తిండి మీదికి తిరుగుతుంది. తినకుండా ఏం చేయగలుగుతారు? అందుచేత అన్నం తింటారు పిల్లలు! బియ్యం త్వరగా అయిపోక మామూలుగా ఇంతకు ముందు లాగా ఎట్లా ఉంటాయి? వాళ్ళని లోటి ప్రపంచం చూడనివ్వకుండా ఉంచడం ఎట్లా సాధ్యం? చూడడం, తమతో పోల్చుకోవడంకూడా వాళ్ళకు తెలిసిపోయింది. గాయం పత్తినట్లుగా కదిలిపోయింది సుగుణమ్మ. ఇంతకు ముందు తా నేమనుకుంది? పిల్లల్ని క్రమశిక్షణలో ఉంచాలనీ, ఆకలికీ—అలవాటుకీ తేడా ఉందనీ, తిండి లేక వీధుల్లో కుక్కల్లాగా బతుకుతూన్న పిల్లల కంటే తన పిల్లలెంతో నయమనీ, వాళ్ళ అమ్మ కంటే తను మేలుగా ఉందని అనుకుంది—అది నిజమే!

అయితే, ఆ బ్రతుకులతో యథార్థ సంబంధం తన కెక్కడా లేదు. డబ్బున్న వాళ్ళ అనుభవాలు ఊహిస్తున్న పిల్లల మాదిరే, తనూ ఆ దౌర్భాగ్యుల్ని ఊహించింది. అది ఆత్మవంచన తప్ప మరేం కాదని గుర్తింప చేస్తున్నది తన బాధ. 'రోజూ టిఫిన్ చేసుకుంటారా?' అని ఆశ్చర్యంగా అడుగుతూన్న వాడు, 'స్పెషల్ దోసె ఎట్లా ఉంటుంది?' అని ఆశగా అడుగుతూన్న వాడు పదేపదే తిరిగే కన్నీటితో కరిగిపోకుండా తేలి, తేలి వచ్చి తనను ముంచేస్తున్నాడు. సంచలనం భరించలేనట్లు, కదిలి ఎడం చేయిమీద ఆనుకుని కూర్చుంది మంచంలో. పక్క మంచంలో ఆఖరి కొడుకు నిద్ర పోతున్నాడు. అమ్మ మీద వ్యాసం రాసిన కొడుకు! చూసి. . . చూసి. . . చెయ్యి సాచి నుదిటిమీద వేసింది. పిడుగు కొట్టుకున్నట్లుగా, తల నించీ పాదం దాకా నిమిరింది.

'అమ్మ ప్రేమ అనే అమృతమిచ్చి బిడ్డలను పెంచును.' కళ్ళలో నీళ్ళు, పెదవుల మీద నవ్వు. నిజంగా ఆ వ్యాసంలో చెప్పినంత సులువుగా అమ్మ బిడ్డల్ని పెంచగలిగితే ఎంత బాగుంటుంది, బాబూ! అమ్మ ప్రేమ అనే అమృతంతో నువ్వు పెరుగుతున్నావా? అబద్ధం. అట్లా అనుకోవడానికి చాలా బాధగా ఉంది. అయితే, నిజాన్ని గుర్తించడం తప్ప ఏం చెయ్యగలను! అమ్మ ప్రేమ అనే అమృత మొక్కటే నిన్ను పెంచి పెద్ద చేయడానికి సరిపోతే, నా బ్రతుకులో ఇంత విషాద విష మెందుకు నిండుకుంటుంది? నిన్ను పెంచడానికి అమృతం కంటే, బియ్యంతో వండిన అన్నం ముఖ్యమని నాకు తెలుసు. అంత గొప్పదాన్నిగా, అంత మహిమ గలదాన్నిగా నీ వ్యాసంలో చెప్పబడిన నేను, నీ చిన్న కడుపుకు పట్టెడన్నం చూసి భయపడిపోయాను. ఈ సెలవుల్లో నా పిల్లల్ని ఒక్క నెల రోజుల పాటు ఉంచుకోగలిగితే నీ ఆపద్బాంధవులన్నా అని ఆలోచించాను. ఎందుకు? కేవలం కొన్ని బియ్యం మిగిలి పోతాయని! నీ అమ్మ ఎంత నిస్సహాయ స్థితిలో ఉందో చూశావా? ఇదివరకటి అమ్మ బొమ్మ నీ కళ్ళకు ఎంత విచిత్రంగా కనపడుతుంది? ఇట్లా స్థితిలోకి రావడానికి అమ్మ ఎంత బాధ పడుతున్నదీ నీకు అర్థం కాదు. నేనూ ఇలాంటిది కోరలేదు. వ్యాసంలోని అమ్మ లాగా ఉండాలనుకున్నాను. నీకూ, నాకూ తెలియని శక్తులు నీ అమ్మనూ, నిన్నూ విడదీస్తున్నాయని ఇప్పుడు నేను తెలుసుకున్నాను గానీ, నీకేం తెలుసు? అమ్మ కొడుకును ప్రేమించడం కూడా వాళ్ళిద్దరి మధ్యనే జరిగేది కాదనీ, అందుకు మిగతా ప్రపంచం, ప్రభుత్వాలు కూడా సహకరించాలనీ ముందు తెలుస్తుంది నీకు. అప్పుడు. . . అమృత మిచ్చి పెంచుతున్నాననుకున్న అమ్మ, నీ స్పెషల్ దోసె చిన్న కోరిక ఎందుకు తీర్చలేకపోయిందో తెలుసుకుని క్షమిస్తావు. అమ్మ పరిధి నింత సంకుచితం చేసిన, అమ్మ ప్రేమ నింత క్రూరంగా అపహాస్యం చేసిన వాటిని మాత్రం క్షమించకూడదనికూడా తెలుసుకుంటావు. ఆ నమ్మకం ఇప్పటికి అమ్మగా మిగిలి ఉన్న అర్హత. ★

